హైదరాబాద్‌లోని హస్తినాపురం చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న వెలమ సంఘం నాయకులు

కరీంనగర్‌లో ప్రెస్‌భవన్ నుంచి టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు ర్యాలీగా వెళ్తున్న వెలమ సంఘం నాయకులు

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై భగ్గుమన్న వెలమలు

- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు
- శంకరయ్య దిష్టిబొమ్మల దహనాలు
- ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు

నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, డిసెంబర్ 7 : వెలమ సామాజిక వర్గాన్ని కించపరుస్తూ మాట్లాడిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్యపై వెలమ సంఘం నాయకులు భగ్గుమన్నారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. పలుచోట్ల ఎమ్మెల్యే దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. బాధ్యత గల పదవిలో ఉండి ఒక సామాజిక వర్గాన్ని కించపరిచేలా మాట్లాడటం సరికాదని అన్నారు. అంతు చూస్తానని బెదిరించిన ఎమ్మెల్యేపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో వెలమలు స్థానిక ప్రెస్‌భవన్ నుంచి టూటౌన్ పోలీసు స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు. హుజూరాబాద్‌లో వెలమ సంఘం సభ్యులు స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మెల్యే ఫ్లెక్సీని దహనం చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని పట్టణ సీఐ తిరుమల్ గౌడ్, తహసీల్దార్ కనకయ్యకు ఫిర్యాదు చేశారు. జమ్మికుంట పోలీసు స్టేషన్‌లో మున్సిపల్ చైర్మన్, వెలమ సంఘం అధ్యక్షుడు తక్కళ్ల పల్లి రాజేశ్వర్‌రావు, సంఘం నాయకులు షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు ఇచ్చారు. వెలమ అసోసియేషన్ ప్రతినిధులు నిజామాబాద్ రూరల్, కామారెడ్డి జిల్లా మాచారెడ్డి ఠాణాల్లో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే శంకరయ్య బహిరంగ క్షమాపణ చెప్పాలని హైదరాబాద్‌లోని నల్లకుంటలో వెలమ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. సంఘం కోశాధికారి చెప్యాల హరీశ్‌రావు, మాజీ కార్యవర్గ సభ్యుడు వీ రవీందర్‌రావు, శ్రీశైలం వెలమ చౌల్ట్రి కమిటీ మెంబర్ గోనె ప్రదీప్‌రావు తదితరులు మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే క్షమాపణ చెప్పకపోతే ఆయన ఇంటితోపాటు అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. వెలమల మనోభావాలను దెబ్బతీసిన ఎమ్మెల్యే శంకరయ్యపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా వెలమ సంఘం ఉపాధ్యక్షుడు తాండ్ర శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. శనివారం వెలమలు బతుకమ్మ పార్కు నుంచి అల్వాల్ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శంకర్ వ్యాఖ్యలపై కూకట్‌పల్లి వెలమ అసోసియేషన్ నేతలు భగ్గుమన్నారు. ఎర్రబల్లి సతీశ్‌రావు, కంచనపల్లి నాగరాజు ఆధ్వర్యంలో వెలమ అసోసియేషన్ నేతలు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ కే నవీన్‌కుమార్‌కు వినతిపత్రాలను అందజేశారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే శంకరయ్యపై స్పీకర్ చర్యలు తీసుకునేలా కృషి చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే శంకరయ్య దిష్టిబొమ్మను జాతీయ రహదారిపై దహనం చేశారు. వెలమ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని బీఎన్ రెడ్డి నగర్ నుంచి హస్తినాపురం వరకు భారీ ర్యాలీ తీశారు. అనంతరం రాస్తారోకో నిర్వహించి ఎమ్మెల్యే శంకరయ్య దిష్టిబొమ్మను దహనం చేశారు.

మాటలను వెనక్కి తీసుకుంటున్నా

వెలమలను దూషించారన్న వివాదంపై షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్య స్పందించారు. తన మాటలు వెలమజాతికి సంబంధించినవిగా భావిస్తే ఉపసంహరించుకుంటున్నానని పేర్కొన్నారు. శనివారం ఆయన షాద్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తాను మాట్లాడిన మాటలను కత్తిరించి వివాదాస్పదంగా మార్చి కొంతమంది సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారని తెలిపారు. తన మాటలను వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటించారు.

ఎమ్మెల్యేపై కాంగ్రెస్ వెలమ నేతల గుస్సా

- కులాన్ని అవమానిస్తావా అంటూ ఆగ్రహం
- శంకర్‌పై చర్యల కోసం పార్టీ పెద్దలపై ఒత్తిడి
- షోకాజ్ నోటీసు జారీచేసినట్టు సమాచారం

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): వెలమ కులస్థులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై సొంత పార్టీలోని వెలమ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. తమ కులాన్నే అవమానిస్తావా అంటూ ఫైర్ అవుతున్నారు. కాంగ్రెస్‌లోని వెలమ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు, ఇతర నేతలు శంకర్ వ్యాఖ్యలను తీవ్రంగా పరగణిస్తున్నట్టు తెలిసింది. ఎమ్మెల్యే శంకర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని పార్టీ పెద్దలపై ఒత్తిడి తీసుకొస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్‌లోని వెలమ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు జూపల్లి కృష్ణారావు, గండ్ర సత్యనారాయణరావు, డాక్టర్ సంజయ్, ప్రేమ్‌సాగర్‌రావు, మైనంపల్లి రోహిత్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తదితర నేతలు దీనిపై చర్చించుకున్నట్టు తెలిసింది. శంకర్ వ్యాఖ్యలు తమకు ఎంతో ఇబ్బందిగా మారాయని, దీనిపై తమ కులస్థుల నుంచి ప్రశ్నలు ఎదుర్కొవాల్సి వస్తున్నదని చెప్పినట్టు సమాచారం. శంకర్‌పై చర్యలు తీసుకుంటే తప్ప తమ కులస్థులు శాంతించేలా లేరని అన్నట్టు తెలిసింది. దీంతో శంకర్‌కు పీసీసీ చీఫ్ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. వాస్తవానికి ఈ విషయాన్ని పార్టీ పెద్దలు పెద్దగా పట్టించుకోలేదని తెలిసింది. ఎమ్మెల్యే శంకర్‌పై చర్యలు ఉంటాయా అన్నదానిపై మాత్రం పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్యే శంకర్ సమాధానం తర్వాత పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలని, పార్టీ నిర్ణయాన్ని బట్టి తమ ఆలోచన ఉంటుందని వెలమ సామాజికవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నేతలు చెబుతున్నట్టు తెలిసింది.

శంకర్‌పై వెలమ సంఘాల ఆగ్రహం

హైదరాబాద్ సిటీబ్యూరో: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఆయన వ్యాఖ్యలపై వెలమ సామాజికవర్గం భగ్గుమంటున్నది. శంకర్ మాటలపై అంతర్జాతీయ వెలమ సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, సింగపూర్, కెనడా, దుబాయ్, స్విట్జర్లాండ్, న్యూజిలాండ్ తదితర దేశాలకు చెందిన ఎన్ఆర్ఐ వెలమసంఘాలు ఎమ్మెల్యే శంకర్‌పై చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీకి ఫిర్యాదు చేశారు. శంకర్ చేసిన వ్యాఖ్యలు తమ మనోభావాలను దెబ్బతీశాయని, తమ సామాజికవర్గాన్ని దూషించిన శంకర్‌పై కఠినచర్యలు తీసుకోవాలంటూ సామాజిక మాధ్యమాల్లో సైతం డిమాండ్ చేస్తున్నారు. ఎమ్మెల్యే శంకర్‌పై కఠినచర్యలు తీసుకోవాలని కోరుతూ నల్లగొండకు చెందిన శంకర్‌రావు, పీ యాదగిరిరావు, ప్రేమ్‌సాగర్‌రావు తదితరులు జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌కు, తెలంగాణ గవర్నర్‌కు, రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేశారు.

పెంపు గోరంత.. ప్రచారం కొండంత!

- హోంగార్డుల డీఏ పెంపు కేవలం రూ.79
- వీక్లీ పరేడ్ అలవెన్స్ పెంపూ వంద రూపాయలే
- పర్మినెంట్ ఊసే ఎత్తని ముఖ్యమంత్రి రేవంత్
- ఎనిమిదేండ్లలో రూ.17 వేలు పెంచిన కేసీఆర్
- 5 లక్షల ప్రమాద బీమా కూడా కేసీఆర్ ఘనతే

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ)/సిటీబ్యూరో: హామీల అమలు కోసం కాంగ్రెస్ సర్కారుపై ఆశలు పెంచుకున్న మరో ఉద్యోగ వర్గానికీ తీరని అన్యాయమే మిగులుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే హోంగార్డులను పర్మినెంట్ చేస్తామన్న ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదు. ఏడాది పాలనలో కేవలం రూ.79 డీఏ పెంచి, రూ.1,000 పెంచినట్టుగా గొప్పలు పోతున్నది. వీక్లీ పరేడ్ అలవెన్స్‌ను రూ.100 మాత్రమే పెంచి తమ జీవితాలను ఏదో ఉద్ధరించినట్టు పోజులు ఇస్తుందని పలువురు హోంగార్డులు మండిపడుతున్నారు. ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షుడిగా హోంగార్డులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి అయ్యాక రేవంత్‌రెడ్డి విస్మరించారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రూ.79కే డీఏను పెంచి హోంగార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం అవమానపర్చిందని మండిపడుతున్నారు. ఏడాదిలో కేవలం రూ.79 పెంచి బలవంతంగా క్షీరాభిషేకాలు చేయించుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికే చెల్లిందని హోంగార్డులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పలువురు హోంగార్డులతో బలవంతపు క్షీరాభిషేకాలు దేనికి సంకేతమని ప్రశ్నిస్తున్నారు. ఏండ్లుగా అరకొర జీతాలతో అష్టకష్టాలు పడుతున్న హోంగార్డులపై అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ముఖ్యమంత్రిగా కేసీఆర్ వరాల జల్లు కురిపించారని గుర్తు చేసుకుంటున్నారు.

ఇతర రాష్ట్రాల్లో రూ.20 వేల వేతనమే

హోంగార్డులకు ఏ రాష్ట్రంలోనూ ఇవ్వనంతగా నాటి కేసీఆర్ ప్రభుత్వం వేతనాలు ఇచ్చిందని హోంగార్డులు గుర్తుచేసుకుంటున్నారు. ప్రధాని మోదీ గతంలో పాలించిన గుజరాత్‌లో నేటికీ హోంగార్డులకు రూ.20,200 మాత్రమే ఇస్తున్నారు. తెలంగాణలో మాత్రం నెలకు రూ.27,630 వేతనం అందుతున్నది. రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల్లో రూ.22 వేల లోపే వేతనాలు ఉండటం గమనార్హం.

కేసీఆర్ హయాంలోనే మూడింతల పెంపు

ఉమ్మడి రాష్ట్రంలో హోంగార్డులకు రూ.6 వేల జీతమే వచ్చేది. 2014 వరకూ వారి వేతనం రూ.9 వేలే. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం హోదాలో 2014 డిసెంబర్ 5న హోంగార్డుల జీతాన్ని రూ.9 వేల నుంచి రూ.12 వేలకు పెంచుతూ కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. పెంచిన జీతాలను 2015 ఏప్రిల్ నుంచి అమలుచేశారు. నెలకు రెండు సార్లు పరేడ్ అలవెన్స్ పేరిట ఇస్తున్న రూ.28ని రూ.100కు పెంచారు. 2017 డిసెంబర్ 13న మరోమారు వారి జీతాన్ని సవరిస్తూ రూ.12 వేల నుంచి రూ.21 వేలకు పెంచారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా హోంగార్డులకు సైతం 30 శాతం పీఆర్సీ ఇవ్వడంతో వారి వేతనాలు అనూహ్యంగా రూ.27 వేలకు పెరిగాయి. ట్రాఫిక్ విభాగంలో పని చేసే హోంగార్డులకు ట్రాఫిక్ కానిస్టేబుళ్లతో సమానంగా 30 శాతం ప్రత్యేక అలెవెన్సును కేసీఆర్ ప్రకటించారు. దీంతో ట్రాఫిక్ హోంగార్డుల వేతనాలు పట్టణాలు, నగరాల వారీగా రూ. 30 వేల నుంచి రూ. 35 వేల వరకు పెరిగాయి. కరోనా ముందు వరకు ప్రభుత్వం ప్రతి ఏటా యూనిఫాం అలవెన్సు కింద రూ.7,500 ఇచ్చింది. మహిళా హోంగార్డులకు ఆరు నెలల మెటర్నరీ సెలవులు ఇచ్చింది. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు చనిపోతే కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా ప్రకటించింది. మరణాంతర కార్యక్రమాల నిర్వహణకు ఇచ్చే రూ.5 వేలను రూ.10 వేలకు పెంచింది. నాడు హోంగార్డుల వేతనాలు, ఇతర భత్యాల కోసం ఏడాదికి రూ.600 కోట్లుకు పైగా ఖర్చుచేసింది. నాడు తీసుకున్న నిర్ణయాల వల్లే నేడు హోంగార్డుల కుటుంబాలు గౌరవంగా బతుకుతున్నాయి.

హోంగార్డులను పర్మినెంట్ చేయాలి

కారుణ్య నియామకాలు చేపట్టాలి ● మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోగా హోంగార్డులను పర్మినెంట్ చేస్తామని పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో గాంధీ దవాఖాన వద్ద ఈ హామీ ఇచ్చారని, ఏడాది పాలన పూర్తయినా ఎందుకు హోంగార్డులను పర్మినెంట్ చేయడం లేదని నిలదీశారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని, పోలీసులకు ఉన్న అన్ని సదుపాయాలను హోంగార్డులకూ కల్పించాలని డిమాండ్‌చేశారు. హోంగార్డుల దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన రూ.921కి కేవలం రూ.79 అదనంగా ఇచ్చి 1,000 పెంచినట్టు ప్రభుత్వం బిల్డప్ ఇస్తున్నదని విమర్శించారు. తాము అధికారంలో ఉన్నప్పుడే హోంగార్డులకు ప్రభుత్వ బీమా సౌకర్యం కల్పించామని గుర్తుచేశారు. నాడు రూ.9 వేల వేతనం ఉండగా, దానిని రూ.20 వేలకు పెంచామని, వారికి 30 శాతం పీఆర్సీ పెంచామని తెలిపారుఉ. హోంగార్డుల జీతాలు పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లలో పనిచేసే వారికి 30 శాతం రిస్క్ అలవెన్స్, పోలీసులతో సమానంగా డ్రెస్ అలవెన్స్, ప్రత్యేక లీవ్‌లు ఇచ్చామని గుర్తుచేశారు.

రెగ్యులరైజ్ కమిటీ వేశాం

హోంగార్డులను రెగ్యులరైజ్ చేయాలని రాజీవ్ త్రివేది నేతృత్వంలో తమ ప్రభుత్వ హయాంలో కమిటీ వేశామని, స్పెషల్ పోలీస్ అసిస్టెంట్లుగా నియామక ప్రక్రియ చేయాలనుకున్నామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. చనిపోయిన హోంగార్డు కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, రిటైరైన వారికి కూడా సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. హోంగార్డుల నియామకాలు వెంటనే చేపట్టాలని సూచించారు. హోంగార్డులకు అసోసియేషన్ ఉండాలని డీజీపీ కార్యాలయంలోనే ఓ గదిని కేటాయించామని, ఇప్పుడు వారికి ఆ గది తాళాలు ఎందుకివ్వడం లేదని నిలదీశారు. క్రమశిక్షణ పేరుతో వేధింపులకు గురిచేసి, సస్పెండ్ చేసిన స్పెషల్ పోలీసులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. హోంగార్డులను వేధిస్తే ఊరుకోబోమని, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



వేములవాడ రాజన్న ఆలయ కార్యనిర్వహణ అధికారి కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

'రాజన్న కోడెల కోత'పై సాగతీత!

- మంత్రి అనుచరుడికి 60 కోడెలు ఇచ్చినట్టు కేసు
- పొంతనలేని అధికారుల తీరు
- కప్పిపుచ్చే దిశగా కేసు సాగదీత
- దరఖాస్తు నిజమేనన్న మంత్రి
- అక్రమాల్లేవంటూ సర్టిఫికెట్
- చర్చనీయాంశమైన 'నమస్తే తెలంగాణ' కథనం

కరీంనగర్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో కోడెల పంపిణీ, అక్రమాల వ్యవహారంపై సాగతీత కొనసాగుతున్నది. ఈ కుంభకోణంపై ఒకవైపు పోలీసులు, మరోవైపు దేవాదాయ శాఖాధికారులు ఆచీతూచి అడుగులేస్తున్నారు. అసలు వాస్తవాలు బయటకు రాకుండా కొందరు ప్రభుత్వ పెద్దలే సంబంధిత అధికారులపై ఒత్తిడి తెస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ దశలో ప్రజలు, ముఖ్యంగా భక్తలు నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది. 'రాజన్న కోడెలు కోతకు?!' శీర్షికన శనివారం 'నమస్తే తెలంగాణ' ప్రధాన సంచికలో ప్రచురించిన కథనం సంచలనం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మంత్రి అనుచరుడైన రాంబాబుకు 60 కోడెలు ఇచ్చినట్టు గీసుకొండ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు, ఆలయ అధికారులు చెప్పున్న పొంతన లేని సమాధానాలు, మంత్రి కొండా సురేఖ లేఖ వంటి పలు అంశాలను కండ్లకు కట్టినట్టు 'నమస్తే' వివరించింది. ఈ కథనం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో బీఆర్ఎస్, బీజేపీ ఆధ్వర్యంలో వేములవాడలోని ఈవో కార్యాలయం ఎదుట ఆందోళనలు కొనసాగాయి. ఈ విషయంపై పూర్తిస్థాయి విచారణ నిమిత్తం వేములవాడ పోలీసులకు వివరాలిస్తామని వెల్లడించారు. ఈ కథనంపై మంత్రి కొండా సురేఖ కూడా స్పందించారు. దరఖాస్తు పరిశీలన నిమిత్తం లేక పంపినట్టు ఒప్పుకున్న మంత్రి.. ఆ వెంటే అందులో ఎటువంటి అక్రమాలు జరగలేదంటూ ముందస్తుగానే సర్టిఫికెట్ ఇవ్వడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేసు వ్యవహారం కొలిక్కి రాకముందే, మంత్రి ముందుగానే ఎలా ప్రకటిస్తరన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నిజానికి భక్తుల నమ్మకాలతో ముడిపడిన ఈ సున్నిత అంశాన్ని 24 గంటల్లో తేల్చే అవకాశమున్నా సాగదీస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ సాగదీత ధోరణి ఎందుకు?

వరంగల్ జిల్లా గీసుగొండ మండలం మనుగొండకు చెందిన మాదాసి రాంబాబు వేములవాడ దేవస్థానం నుంచి కోడెలను తీసుకెళ్లి, వాటిని కోతకు విక్రయిస్తూ వ్యాపారం చేస్తున్నాడని కొందరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గీసుకొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తమకు వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టాలని, 60 కోడెలు తెస్తే అందుల్లో 11 మాత్రమే ఉన్నాయని, మిగిలిన 49 లేకపోవడంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ మహేందర్ స్వయంగా చెప్పిన విషయం మీడియాలో వచ్చింది. ఈ విషయంలో పూర్తి వివరాలు ఇవ్వాల్సిందిగా రాజన్న ఆలయ అధికారులను కోరినట్టు సీఐ తెలిపారు. ఈ మేరకు అధికారులు ఒక బృందాన్ని ఏర్పాటుచేసి, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను గమనించి నిజానిజాలను నిగ్గుతేల్చాల్సిన అవసరం ఉన్నది. కానీ, ఈ కోణంలో ఆలయ అధికారులు అడుగులే వేయలేదు. భక్తుల నమ్మకాలతో కూడుకున్న ఇటువంటి సమస్య ఎదురైనప్పుడు యుద్ధప్రాతిపదికన తేటతెల్లం చేయాలి. కానీ, ఈ విషయంలో తీవ్రమైన సాగదీత ధోరణి కనిపిస్తున్నది. ఈనెల 29న కేసు నమోదైతే ఇప్పటివరకు వాస్తవాలు బయటకే రాలేదు. మంత్రితోపాటు ఈవో ఇచ్చిన వివరణలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మంత్రి గారూ.. వీటికి జవాబెక్కడ?

'రాజన్న కోడెలు కోతకు?!' శీర్షికన శనివారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురించిన కథనంపై స్పందించిన రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శనివారం ఒక ప్రకటన జారీచేశారు. దరఖాస్తును అధికారులకు పంపించింది వాస్తవమేనని ఒప్పుకున్న మంత్రి, ఈ వ్యవహారంలో ఎక్కడా అవకతవకలు, అక్రమాలు జరగలేదని ముందుగానే సర్టిఫికెట్ ఇచ్చేశారు. మంత్రి ఈ ప్రకటనను నిశితంగా పరిశీలిస్తే అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మాదాసి రాంబాబుపై గీసుకొండ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుపై విచారణ చేపట్టామని, పూర్తి వివరాల కోసం రాజన్న ఆలయానికి లేఖ రాశామని సీఐ మహేందర్ తెలిపారు. పోలీసులు అడిగిన వివరాలను శనివారం పంపిస్తున్నట్టు ఆలయ ఈవో మీడియా సాక్షిగా వెల్లడించారు. ఈ వ్యవహారంపై లోతుగా విచారణ జరిపేందుకు వేములవాడ పోలీసులను ఆశ్రయిస్తామని శనివారం మీడియా సాక్షిగా ఆలయ ఈవో వివరించారు. అంటే ఈ వ్యవహారంలో ఇంకా నిజానిజాలు బయటకు రాలేదని సుస్పష్టమవుతున్నది. వాస్తవలను నిగ్గు తేల్చేందుకు అటు గీసుకొండ పోలీసులు, ఇటు రాజన్న ఆలయ ఈవో ప్రయత్నాలు చేస్తున్నట్టు అర్థమవుతున్నది. విచారణ జరిగి వాస్తవాలు వెనుక ఉద్దేశమేమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. విచారణ పూర్తికాక ముందే మంత్రి ఈ ప్రకటన చేయడాన్ని బట్టి చూస్తే ఈవిషయంలో విచారణ ముందుకెళ్తుందా? లేదా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. నిజానిజాలు బయకు రావాలంటే నిష్పాక్షికంగా విచారణ జరగాలన్న డిమాండ్ వస్తున్నది. అవసరమైతే ఒక ప్రత్యేకాధికారిని నియమించి విచారణ చేస్తే వాస్తవాలు బయటకొస్తాయని పలువురు భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఈ ప్రశ్నలకు బదులేవి?

భక్తులు సమర్పించిన కోడెల నిర్వహణ నిమిత్తం విధివిధానాలను రూపొందించేందుకు 6 నెలల క్రితం మేలో సిరిసిల్ల జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, వేములవాడ ఆలయ ఈవో కన్వీనర్‌గా, పలువురు ఇతర సభ్యులతో ఏర్పాటుచేసిన కమిటీ మార్గదర్శకాలను రూపొందించి జీవో విడుదల చేసినట్టు మంత్రి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. కానీ, మాదాసి రాంబాబు ఆగస్టు 12న దరఖాస్తు పెట్టుకోగా, ఆగస్టు 16న మంత్రి ఆ దరఖాస్తును ఎండార్స్‌మెంట్ చేశారు. అందులో మరో విశేషమేమిటంటే.. రాంబాబు రైతు పేరిట దరఖాస్తు చేయలేదు. తనకు గోశాల ఉన్నదని, వేములవాడ, యాదాద్రి ఆలయాల నుంచి కేటాయింపులు జరిగేలా చూడాలని అందులో కోరారు. మంత్రి చెప్పినట్టు ఆరు నెలల క్రితం జీవో విడుదల చేస్తే.. ఆగస్టులో పెట్టుకున్న రాంబాబు దరఖాస్తును అధికారులకు ఎలా ఫార్వర్డ్ చేశారు? రైతులకు ఇవ్వాలని స్పష్టంగా జీవోలో ఉన్నప్పుడు.. శ్రీరాజేశ్వర సొసైటీ పేరిట నడుపుతున్నట్టు చెప్పిన గోశాలకు ఇవ్వాలన్న దరఖాస్తును ఎలా అంగీకరించారు?

ఏది నిజం.. ఏది అబద్ధం!

ఒక వేల మాదాసి రాంబాబు ఒకవేళ రైతు అని అనుకున్నా.. వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టామని, 60 కోడెలు తెస్తే అందులో 11 మాత్రమే ఉన్నాయని, మిగిలిన 49 లేకపోవడంతో కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నామని సీఐ మహేందర్ స్వయంగా చెప్పారు. నిబంధనల ప్రకారమే ఇచ్చారని మంత్రి చెప్తున్నారు. మరి రాంబాబు 60 కోడెలు తెచ్చారని పోలీసులెలా చెప్పారు? అందులో ఏది అబద్ధం? ఏదీ నిజం? ప్రతి కోడెకు ట్యాగింగ్ ఉన్నదని మంత్రి, అధికారులు చెప్తున్నారు. ఎంత మంది రైతులకు ఇచ్చారో? వాటి వివరాలు, ట్యాగుల వివరాలు బయటకు ఇవ్వడానికి అధికారులు ఎందుకు జంకుతున్నారో చెప్పాలన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఆందోళనలతో అట్టుడికిన వేములవాడ

వేములవాడ, డిసెంబర్ 7: 'రాజన్న కోడెలు కోతకు?!' వార్త తెలిసి వేములవాడ పట్టణం అట్టుడికింది. బీఆర్ఎస్, బీజేపీ వేర్వేరు ఆందోళనలు కొనసాగాయి. రాజన్న ఆలయ ఈవో కార్యాలయం వద్ద నిరసనలకు దిగారు. 'నమస్తే' కథనాలను చేత పట్టుకొని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజన్న భక్తులు స్వామివారికి సమర్పించిన నిజ కోడెలను నిబంధనలకు విరుద్ధంగా ఎలా కేటాయిస్తారని, మంత్రి సిఫారసుతో ఒకే వ్యక్తికి 60 కోడలు ఎలా ఇచ్చారని నాయకులు మండిపడ్డారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తకు ఎలా కేటాయించాంటూ అధికారులను ప్రశ్నించారు. కోడెలను కోతకు సంబంధించిన వ్యక్తికి ఇచ్చి మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించారని మంత్రిపై మండిపడ్డారు. వెంటనే మంత్రి సురేఖను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఈవో వినోద్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ నిరసనలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, కౌన్సిలర్లు మారం కుమార్, నిమ్మశెట్టి విజయ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, నాయకులు రామతీర్థపు రాజు, ముద్రకోల వెంకటేశం, వెంగళ శ్రీకాంత్‌గౌడ్ వెంకట్‌రెడ్డి, రవీందర్, రాధాకిషన్‌రావు, వాసాల శ్రీనివాస్, ప్రేమ్ చారి, సందీప్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు ఆధ్వర్యంలో 'నమస్తే కథనం', మంత్రి సిఫారసు చేసిన లేఖను చూపుతూ ఈవో కార్యాలయం గదిలోనే బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. 2 గంటలపాటు కార్యాలయంలోనే కూర్చొని కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పే వరకు తాము లేవబోమని భీష్మించుకొని కూర్చున్నారు. ఈవో ను కూడా సస్పెన్షన్ చేయాలని ఏఈవో శ్రవణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో బీజేపీ నాయకులు నామాల శేఖర్, రాజ్‌కుమార్, హనుమాన్లు, సగ్గ రాహుల్ పాల్గొన్నారు.

ఒక రైతుకు రెండు కోడెలే ఇస్తున్నాం

**